
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 133 వ భాగం

## సూర్యవంశం - 1

దశావతారాలలో ఒకటిగా చెప్పబడే రాముడిది సూర్యవంశం కదా, ఆయన పూర్వులు ఎవరు అనే దాంతో మొదలుపెట్టి ఇక్ష్వాకు వంశం గురించీ రామావతారం గురించీ చెప్పేదే భాగవతంలో నవమ స్కంధం. ఈ స్కంధం మొదలుపెడుతూ ఎప్పటిలాగానే పోతన, పలికించెడువాడు రామభద్రుడట అనుకుంటూ రాసిన మొదటి పద్యం ఇది.

క. శ్రీరాజిత! మునిపూజిత!
వారిధి గర్వాతిరేక వారణ బాణా!
సూరిత్రాణ! మహోజ్జ్వల!
సారయశస్సాంద్ర! రామచంద్ర నరేంద్రా! [9.1]

ఎన్ని సార్లు చదివినా, మరోసారి చదవాలనిపించే అతి సులభమైన పదాలతో రాముడికి రాసిన పద్యం ఇది. ఈ పద్యం లో శ్రీరాజిత – శ్రీ (లక్ష్మీదేవి తో), రాజిత (ప్రకాశించేవాడు); సూరిత్రాణ – సూరి (పండితులని) త్రాణ (కాపాడేవాడు). ఇందులో ద్రాక్షాపాకం ఎంత సులభంగా ఉందో, దాని అర్థం అంత నిఘూఢంగా ఉండడం, పోతన కవితా పటిమకి నిదర్శనం. క్రితం వ్యాసంలో మత్స్యావతారం గురించి చూసాం కదా. మనువులు ఎలా పుడతారు, ఒక మన్వంతరం అయ్యాక కల్పాంతంలో విష్ణువు రాబోయే తరానికి ఎవరిని మనువుగా ఉంచుతాడు అవీ పరీక్షిత్తు విన్నాడు. ఇప్పుడు శుకమహర్షిని అడుగుతున్నాడు – సత్యవ్రతుడు విష్ణువుని సేవించి విజ్ఞానం సంపాదించాక వైవశ్వతుడనే మనువుగా సూర్యునికి పుట్టాక ఏమైంది? మిగతా కథ ఏమిటి?

సీ. మనువుల నడవళ్ళు మర్యాదలును వింటి
మన్వంతరంబున మాధవుండు
దిరిగిన జాడలు దెలిసె సత్యవ్రతుం
డను రాజు ద్రవిళదేశాధిపుండు
పోయిన కల్పాంతమున విష్ణు సేవించి
విజ్ఞానమును బొంది వెలుఁగుఱేని
కతఁడు వైవస్వతుండై పుట్టి మను వయ్యె
నతనికి నిక్ష్వాకుఁడాదిగాఁగఁ [9-3]

తే. బదురు గొడుకులు గల రండ్రు, పరఁగ వారి
వంశ మేరీతి వర్తించె? వారిలోనఁ
జనినవారిని, జనువారిఁ, జనెడువారిఁ
జెప్పవే వ్యాసనందన! చిత్తగించి. [9-3.1]

ఈ వైవశ్వతుడుకి పదిమంది కొడుకులు పుట్టారంటారు ఇక్ష్వాకుడితో పాటు. వాళ్ళ వంశం ఏ రీతిగా విస్తరించింది? వాళ్లగురించి చెప్పండి అని శుకుణ్ణి (వ్యాసనందన) అడుగుతున్నాడు. పై తేటగీతిలో పోతన జనినవారి, జనువారి, జనెడువారి అంటూ భూత వర్తమాన భవిష్యత్తులని ఎలా కలిపాడో గమనించారా? సీస పద్యంలో సూర్యుడనేది ఎక్కడుందో చెప్పండి చూద్దాం? వెలుగురేడు – సూర్యుడు.

వ. అనినం బరాశరముని మనుమం డిట్లనియె. [9-5]

ఇలా అడిగిన పరీక్షిత్తుకి శుకమహర్షి చెప్తున్నాడు. ఈ వచనంలో శుక మహర్షిని పోతన ఏమన్నాడో చూసారా? పరాశర మనవడు. పరాశర మహర్షి కొడుకు వ్యాసుడు. వ్యాసుడి కొడుకి శుకమహర్షి కదా? వీరి వంశక్రమం మనం విష్ణుసహస్రనామం మొదట్లో వ్యాసుణ్ణి తల్చుకుంటూ చెప్పే శ్లోకంలో కూడా చూడవచ్చు.

వ్యాసం వసిష్ఠ నప్తారం శక్తే: పౌత్రమకల్మషం
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిం

వసిష్ఠుని మునిమనవడు, శక్తి మనుమడు, పరాశరుని కుమారుడు, శుకుని తండ్రి, తపోనిధి అయిన వ్యాసునికి నమస్కారం అని దీని అర్థం. వేదాలు విభజించాక విష్ణువు పై భక్తి ప్రధానంగా వ్యాసుడు రాసినదే మహాభాగవతం. పరిపూర్ణ యోగి అయిన శుకుడు ఆయనకి కొడుకుగా పుట్టాక వ్యాసుడి ఆధ్యాత్మిక వ్యక్తిత్వం సంపూర్ణమైంది కనక వ్యాసుని తండ్రి తాత ముత్తాతలతో పాటు శుకుణ్ణి కూడా స్మరించడం ఆచారం. ఇలా అడిగిన పరీక్షిత్తుకి శుకమహర్షి చెప్తున్నాడు ఈ సూర్యవంశం కథ.

ఆ. వినుము, మనువుకులము వేయి నూఱేండ్లును
బరఁగ విస్తరించి పలుకరాదు,
నాకుఁ దోఁచినంత నరనాథ! వేగంబ
యెఱుకపడఁగఁ బ్రీతి నేర్పరింతు. [9-6]

క్రితం వ్యాసాలలో చూచినట్టూ కాలం అనంతం – యుగాలకీ మహాయుగాలకి విస్తరించి ఉంది. అటువంటి అనంతప్రవాహమైన కాలంలో వెయ్యేళ్ళలో, నూరేళ్ళలో, లేదా ఓ లక్ష ఏళ్ళలో జరిగినవన్నీ పూర్తిగా చెప్పడం అసాధ్యం. తెల్సినంతలో వేగంగా చెప్తాను విను. ఇలా ఎందుకన్నాడని ఆలోచిస్తే మనకో విషయం అర్థమౌతుంది. పరీక్షిత్తు కథలో పడి కాలం మర్చిపోవచ్చు. ఏడు రోజుల్లో తక్షకుడి కాటుతో ఆయన ప్రాణం నిశ్చయంగా పోతుందని తెలుసు కదా? ఇప్పుడీ మనువుల కథంతా అంతా వింటూ ఉంటే సమయం గడిచిపోతుంది, మిగతా భాగవతం కథ పూర్తవదు. అందుకే క్లుప్తంగా చెప్తాను అంటున్నాడు. మరో విషయం ఏమిటంటే రాముడికి ఉన్నంత కథ మిగతా వారికి లేకపోవచ్చు ఈ సూర్య వంశంలో.

క. ఎక్కువ దక్కువ పొడవుల
కెక్కటి మొదలయిన పురుషుఁ డింతయుఁ జెడఁ దా
నొక్కఁడుఁ గల్పాంతంబున
నక్కజమై నిల్చె విశ్వ మతఁడై యుంటన్. [9-7]

చిన్నా పెద్దా అన్ని ప్రాణులకీ మూలవిరాట్టు అయిన పురుషుడు, అంటే భగవంతుడు కల్పాంతం అయినా విశ్వమంతా తానే కనక ఒక్కడే నిలిచి ఉండగలడు.

సీ. భూమీశ! యమ్మహాపురుషుని నాభిమ
ధ్యమున బంగారుఁ గెందమ్మి మొలిచె;
నా దమ్మిపూవులో నటమీఁదఁ దనయంత
నాలుగు మోముల నలువ పుట్టె;
నాబ్రహ్మమనమున నట మరీచి జనించె
గశ్యపుం డతనికిఁ గలిగెనంత,
నా కశ్యపునికి దక్షాత్మజ యదితికి
గొమరుఁడై చీఁకటి గొంగ పొడమె; [9-8]

తే. జలజ బంధుని పెండ్లాము సంజ్ఞ యందు
శ్రాద్ధదేవుండు మనువు సంజాతుఁ డయ్యె;
మనువునకు శ్రద్ధ యనియెడి మగువ యందు
బదురు గొడుకులు గలిగిరి భద్రయశులు. [9-8.1]

అలాంటి విష్ణువుకి నాభిలోంచి పద్మం పుట్టింది. అందులోంచి చతుర్ముఖుడైన బ్రహ్మ (నాలుగు మోముల నలువ), ఆ బ్రహ్మకి కశ్యప ప్రజాపతి, దక్షుడు, ఆయన కూతురు అదితి పుట్టారు. ఆ అదితికి సూర్యుడు కుమారుడిగా పుట్టాడు. ఈ సీస పద్యంలో సూర్యుడు అనేది చీకటి గొంగ – చీకటికి శతృవు, అన్నాడు పోతన. ఆ సూర్యుడుకి (జలజ బంధువు – జలజం అంటే పద్మం కనక పద్మం వికసించడానికి సహాయపడే బంధువు), సంజ్ఞ అనే ఆవిడకీ శ్రాద్ధదేవుడు అనే ఆయన పుట్టి మనువయ్యాడు. ఆ మనువుకి శ్రద్ధ అనే ఆవిడవల్ల పదిమంది కొడుకులు పుట్టారు – వారు ఎలాంటివారు? భద్ర యశులు – మంచి/పవిత్రమైన కీర్తి కలవారు.

వ. వార లిక్ష్వాకుండును, నృగుండును, శర్యాతియు, దిష్టుండును, ధృష్టుండును, గరూశకుండును, నరిష్యంతుడును, బృషద్ధ్రుండును, నభగుండును, గవియు నన నెగడి; రటమున్ను మనువు గొడుకులు లేని వాఁడయి, మిత్రావరుణుల నుద్దేశించి. [9-9]

వీళ్ళు ఇక్ష్వాకుడు, నృగుడు, శర్యాతి, దిష్టుడు, ధృష్టుడు, కరూశకుడును, నరిష్యంతుడు, పృషధ్రుడు, నభగుడు, కవి అనేవారు. ఇంకా సరదా కథ ఉంది. ఈ పదిమంది పుట్టక ముందు మనువు కొడుకుల కోసం మిత్రా వరుణులని ఉపాసించి ఒక యజ్ఞం తలపెట్టాడు.

సీ. మనువు బిడ్డలు పుట్ట మఖ మాచరించుచో
నతని భార్యయు హోత నాశ్రయించి
కూఁతురు పుట్ట నాకుం జేయుమని పల్కి
వరభక్తితోఁ బయోవ్రతము సలిపె;
నా సతి చెప్పిన ట్లధ్వర్యుఁడును హోత
నగుఁగాక! వేలుపు మనుచుఁ బలికె;
హవి సందుకొని కూఁతు రయ్యెడు మని వష
ట్కారంబు చెప్పుచుఁ గదిసి వేల్వ [9-10]

తే. హోత పెడచేత నిల యను నువిద పుట్టె
దానిఁ బొడగని మనువు సంతాప మంది,
"కొడుకుమేల్ గాక; యేటికిఁ గూతు? రకట
చెప్పవే" యని పోయె వసిష్ఠుకడకు. [9-10.1]

ఈ యజ్ఞం చేస్తున్నప్పుడు మనువు భార్య హోత దగ్గిరకి వెళ్ళి నాకు కూతురు పుట్టేలాగా చేయండి అని అడిగింది. ఆయన సరే అని ఆవిడ అడిగినట్టూ కూతురు పుట్టాలి అంటూ వషట్కార మంత్రాలు చెప్తూ హోమ ద్రవ్యాన్ని అగ్నిలో ఆహుతి చేసాడు. అందువల్ల ఈ మనువుకి 'ఇల' అనే కూతురు పుట్టింది. ఇలా కూతురు కావాలి అని హోతని అడిగినట్టు ఆవిడ తన భర్తతో చెప్పిందో లేదో మనకి తెలియదు. అందువల్ల మనువు వసిష్టుడి దగ్గిరకి వెళ్ళి అడిగాడు "ఇదేమిటి కొడుకు కోసం యజ్ఞం చేస్తే కూతురు పుట్టిందేం?" ఇది చాలనట్టు ఇంకా దెప్పుతున్నాడు వసిష్టుణ్ణి.

వ. అదియునుంగాక; మీరు బ్రహ్మవాదులరు; మంత్రవాదులరుఁ; బాపంబు లందకుండం జేయించువారిది యేమి?" యనవుడు మా తాత వసిష్ఠుండు హోతృవ్యభిచారం బెఱింగి, మనువున కిట్లనియె. [9-13]

మీరు బ్రహ్మవేత్తలు, మంత్రతంత్రాలన్నీ బాగా తెలిసిన వారు. మాలాంటి వారిచేత పాపం అంటుకోకుండా ఉండడానికి ఇలా యజ్ఞాలు చేయిస్తూ ఉంటారు కదా. అయినా ఇదేమిటి ఇలా జరిగింది?

తే. అధిప! సంకల్ప వైషమ్య మగుటఁ జేసి
హోతకల్లతనంబుననువిదగలిగె
నైనఁగలిగింతు నీకుఁబ్రియాత్మజునిగ
నీవు మెచ్చంగఁజూడు నా నేర్పుబలిమి. [9-14]

దీనికి వసిష్టు డు చెప్తున్నాడు - సంకల్పం చెప్పేటప్పుడు హోత చేసిన తప్పు (కల్ల తనంబు) వల్ల ఇలా కూతురు (ఉవిద) పుట్టింది. అయినా నీకు నచ్చినట్టూ ఈ అమ్మాయిని అబ్బాయిగా చేస్తాను. నా నేర్పు, తపో బలం, శక్తీ చూద్దువుగాని.

వచ్చే వ్యాసంలో ఈ కూతురు కొడుకుగా, మళ్ళీ ఆ కొడుకే కూతురుగా అవడం అనే విషయాలు మిగతా ఇక్ష్వాకు/సూర్య వంశం కథ చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS